ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 5 ఆగస్టు 2024

రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు పరిష్కారమెప్పుడు? 8లో..

తాగడానికి డబ్బులు లేక మద్యం షాపుల్లో చోరీలు 6లో..

గుర్తింపు ఏదీ..?



- 8 నెలలు గడిచినా తేలని 'ధ్రువీకరణ' వ్యవహారం
- నాలుగేళ్ల కాలపరిమితి కోసం ఏఐటీయూసీ పట్టు
- ప్రభుత్వానికి రాశామంటున్న సింగరేణి యాజమాన్యం

గోదావరిఖని, ఆగస్టు 4: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘానికి 'గుర్తింపు' లేదు. గడిచిన డిసెంబరు 27న ఎన్నికలు జరిగితే ఇప్పటికీ ఏఐటీయూసీకి గుర్తింపు సంఘంగా ధ్రువీకరణ పత్రం రాలేదు. ఎనిమిది మాసాలుగా ఏఐటీయూసీ తమని గుర్తించమని వేడుకుంటున్నా పట్టించుకున్న నాథుడు లేడు. సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూళ్ల నేపథ్యంలో సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీకి ధ్రువీకరణ ఇవ్వలేమని ఇంత కాలం చెప్పారు. ఇప్పుడు కూడా ఈ చిక్కులు వీడలేదు. కార్మికులు ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చినప్పటికీ యాజమాన్యం మాత్రం ఏఐటీయూసీని గుర్తించడం లేదు. రెండేళ్ల కాలపరిమితికి మాత్రమే గుర్తింపును ఇస్తామని సింగరేణిలో ఎన్నికలు నిర్వహించిన ఆర్ఎల్‌సీ తేల్చిచెప్పింది. అయినప్పటికీ గుర్తింపు మాత్రం తాము ఇవ్వలేమని ఏఎల్‌సీ చెబుతుంటే, తమకు సంబంధం లేదని యాజమాన్యం పేర్కొంటున్నది.

ఇదిలా ఉండగా ఏఐటీయూసీ నాలుగేళ్ల కాలం గుర్తింపును ఇస్తూ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నది. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని యాజమాన్యం చేతులు దులుపుకున్నది. ఎనిమిది మాసాలు అయినా ఏఐటీయూసీ మాత్రం తమ గుర్తింపు విషయంలో త్రిశంకు స్వర్గంలోనే ఉన్నది. కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించేందుకు సింగరేణిలో ఇప్పుడు ఏ సంఘానికి అధికారం లేదు. మైన్స్, సేఫ్టీ కమిటీలు, త్రైపాక్షిక రక్షణ సమావేశాలు మినహా స్ట్రక్చర్ సమావేశాలు, ఏరియా స్థాయి, కార్పొరేట్ స్థాయిలో ఎలాంటి చర్చలు, ఒప్పందాలు కార్మిక సమస్యల విషయంలో కొనగడం లేదు. ప్రభుత్వం ఆదేశించడం, యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం మినహా కార్మిక సమస్యల విషయంలో చర్చించేందుకు సింగరేణిలో వేదికే లేకుండా పోయింది. దీనికి తోడు ఏఐటీయూసీ తమకు గుర్తింపు పత్రం ఇచ్చిన తేది నుంచి నాలుగేళ్ల పాటు గుర్తింపు హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది. మిగిలిన కార్మిక సంఘాలు ఎన్నికల తేది నుంచే గుర్తింపు పరిగణలోకి తీసుకోవాలనే వాదన వినిపిస్తున్నాయి.

మూడు అంశాలపై స్పష్టత కరువు..

2018లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల తరువాత 2023 వరకు ఆరేళ్ల పాటు సింగరేణిలో గుర్తింపు ఎన్నికలే జరుగలేదు. ప్రభుత్వం, యాజమాన్యం అడ్డుచెప్పకపోవడం, పైగా ఇతర సంఘాలు ఎన్నికలకు డిమాండ్ చేసి కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చినప్పటికీ అనేక కారణాల చేత ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఎన్నికలు జరిగినప్పటికీ గెలుపొందిన ఏఐటీయూసీకి గుర్తింపు దొరకడం లేదు. దీనికి తోడు మరో సాంకేతిక అంశాన్ని కూడా చర్చకు తెస్తున్నారు. సింగరేణిలోని 11 డివిజన్లలో ఆరు డివిజన్లలో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. ఏఐటీయూసీ ఐదు డివిజన్లలో మాత్రమే గెలిచింది. కాకపోతే ఏఐటీయూసీకి మొత్తం సింగరేణిలో ఐఎన్‌టీయూసీ కంటే 1800ఓట్లు అధికంగా వచ్చాయి.

గతంలో అత్యధిక ఓట్లు సాధించిన యూనియనే గుర్తింపు కార్మిక సంఘంగా కొనసాగుతూ వస్తున్నది. ఎప్పుడూ కూడా గుర్తింపు కార్మిక సంఘమే అత్యధిక డివిజన్లలో కూడా విజయం సాధించేది. ఈ ఎన్నికల్లో ఇందుకు భిన్నంగా ఐఎన్‌టీయూసీ ఎక్కువ డివిజన్లు గెలువడం, ఏఐటీయూసీ ఎక్కువ ఓట్లు సాధించడంతో మరో చర్చ మొదలైంది. ఇన్ని రకాల సాంకేతిక ఇబ్బందులు ఉండగా సింగరేణిలో గుర్తింపు సంఘాన్ని ప్రకటించకపోతే అన్ని సంఘాలను సమానంగా పరిగణించాలని టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్‌లాంటి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఏఐటీయూసీకి గుర్తింపు ధ్రువీకరణ రావాలంటే మూడు అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

అసలు ఎవరు ఏఐటీయూసీని గుర్తింపు సంఘంగా గుర్తించి ధ్రువీకరణ ఇవ్వాలి అనేది ప్రధానమైన అంశం. గుర్తింపు కాలపరిమితి నాలుగేళా..? లేక రెండేళ్లా..? అనేది కూడా తేలా ల్సి ఉంది. వీటితో పాటు ఎన్నికలు నిర్వహించిన తేది నుంచి కాల పరిమితి మొదలవుతుందా, గుర్తింపు పత్రం ఇచ్చిన నాటి నుంచి పరిగణనలోకి తీసుకుంటారా..? అనేది మరో చిక్కుముడి. ఇన్ని ఇబ్బం దులతో ఏఐటీయూసీకి ఎందుకు గెలిచాముదా అనే పరిస్థితి ఏర్పడింది. కార్మికవర్గం నుంచి కూడా ఏఐటీయూసీకి రోజుకింత ఒత్తిడి పెరుగుతున్నది. యూనియన్‌లోని కొన్ని వర్గాలు కూడా కాలపరిమితి విషయంలో పట్టు విడుపులతో ఉండాలని, అధికారికంగా గుర్తింపు పత్రం త్వరగా తీసుకోవాలని పేర్కొంటున్నాయి. సింగరేణిలో అనేక కార్యకలాపాల కార్యాచరణ క్రియాశీలంగా జరుగుతున్నది. ఈ మధ్య గని ప్రమాదాలు కూడా పెరిగాయి. ఈ సందర్భాల్లో గుర్తింపు కార్మిక సంఘం కంటే ఇతర కార్మిక సంఘాలే ఎక్కువ స్థాయిలో స్పందిస్తున్నాయి. ఈ పరిణామం కూడా ఏఐటీయూసీకి క్షేత్రస్థాయిలో ఇబ్బందులు కలిగిస్తున్నది.

ఖనిలో క్వార్టర్ల బాధితుల నిరసన భగ్నం

- అడ్డుకున్న పోలీసులు.. గందరగోళం..



పోలీసుల ఆదేశాలతో టెంట్, సామగ్రిని తొలగిస్తున్న బాధితులు

గోదావరిఖని, ఆగస్టు 4: గోదావరిఖని లక్ష్మీనగర్ ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా 82సింగరేణి క్వార్టర్ల తొలగింపు అంశం ఇంకా రగులుతూనే ఉన్నది. తమ క్వార్టర్లను తొలగించరాదని పోరాటాలు చేస్తున్న బాధిత కార్మికులు ఆదివారం చౌరస్తాలో సత్యాగ్రహ దీక్ష పేర నిరసన కార్యక్రమానికి దిగారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. టెంట్లు, కుర్చీలు తొలగించాలని ఆదేశించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. తాము శాంతియుతంగా, చట్ట పరిధిలో దీక్ష చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడమేమిటని బాధితుల పక్షాన తోట వేణు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. భావ ప్రకటన స్వేచ్ఛను కూడా హరించి వేయడం ప్రజాస్వామ్యం కాదని వాదించారు. నిరసన దీక్ష అనుమతుల కోసం మీసేవాలో నాలుగు రోజుల క్రితం దరఖాస్తు చేసుకుని రుసుము చెల్లించినప్పటికీ పోలీసులు కావాలని అనుమతులు ఇవ్వడం లేదని వేణు ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పోలీసులు దీక్షను భగ్నం చేశారు. అయితే తమ న్యాయమైన హక్కులను సాధించుకునే వరకు క్వార్టర్లను కాపాడుకునే విషయంలో పోరాడుతామని కార్మికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్వార్టర్ల కార్మికులు మాదాసు లక్ష్మయ్య, పోతరాజు భాస్కర్, నర్సింహారాజు, రమేష్, శంకర్, శ్రీనివాస్, జావెద్, దేవ వెంకటేష్, కిరణ్‌జీ, పాషా, ఠాకూర్, దబ్బెట సతీష్ కుమారస్వామి, వెంకటేశ్వర్లు, శ్యాం, రామస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

మంథని, ఆగస్టు 4: మంథని ప్రభుత్వ పాఠశాలలో 2004-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మంథని కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పూర్వ ప్రిన్సిపాల్‌లు ముష్ఫుద్దీన్, దాదాసలాం, లెక్చరర్లు కమలారాణి, రజిని, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి గురువులకు విద్యార్థులు ఘనంగా సత్కరించి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భవిష్యత్‌లో తమ బ్యాచ్ తరుపున ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుమంత్‌రెడ్డి, సతీష్, సంతోష్, అశోక్‌రెడ్డి, సంధ్య, సరిత, అనిత తదితరులున్నారు.

క్వార్టర్ల తొలగింపు సహేతుకం కాదు..

- సీఎండీకి హెచ్ఎంఎస్ లేఖ

గోదావరిఖని, ఆగస్టు 4: గోదావరిఖనిలో షాపింగ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు కోసం సింగరేణి కార్మికుల క్వార్టర్లను తొలగించడం సహేతుకం కాదని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎండీకి లేఖ రాశారు. గోదావరిఖనిలో ఇప్పటికే ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వినియోగంలేదని, అయినప్పటికీ 82మంది కార్మికుల క్వార్టర్లు కూలదోసి కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టడం సరికాదని ఆయన ఆ లేఖలో సీఎండీని కోరారు. సింగరేణిలో ఉన్న సూపర్ బజారే నడవని పరిస్థితుల్లో కార్మికుల క్వార్టర్లు కూలదోసి కార్పొరేట్ కంపెనీలను తీసుకురావడం వల్ల సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అందులో పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు ఆధునీక గృహాలు, డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టించి ఇవ్వాల్సింది పోయి ఉన్న క్వార్టర్లను కూలదోస్తామనే విషయంలో కూడా యాజమాన్యం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. దురాక్రమణల కోసమే ఈ క్వార్టర్ల తొలగింపు కుట్ర జరుగుతోందని రియాజ్ ఆరోపించారు. క్వార్టర్లు తొలగించిన ప్రాంతం సింగరేణి సరిహద్దు చివరలో ఉందని, దీన్ని అడ్డుగా పెట్టుకుని ప్రైవేట్ శక్తులు, వ్యక్తులు ఈ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆక్రమణలకు తావులేకుండా ఈ క్వార్టర్ల చుట్టూ సింగరేణి యాజమాన్యం ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. క్వార్టర్ల తొలగింపు, ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను చట్ట ప్రకారం లేవని, పైగా సింగరేణి ఉద్యోగుల సంక్షేమాన్ని, వారి మనోభావాలను వదిలేసి క్వార్టర్లను తొలగించడం సహేతుకం కాదని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రతిపాదిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ విషయంలో సర్వేలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



కేక్ తినిపించుకుంటున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 4:స్నేహితుల దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు దీటి బాలరాజు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరూ స్నేహపూర్వకంగా కలిసి మెలిసి ఉండాలని, రామగుండం అభివృద్ధి కోసం అందరూ కలిసిమెలిసి ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో చెరుకు బుచ్చిరెడ్డి, పోలు భాస్కర్, పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, కుర్మ శ్రీనివాస్, ఎండీ హమీద్, మహంకాళి అంజయ్య, మంద రమేష్, బాలసాని స్వామిగౌడ్, మొహిద్ సన్నీ, గంగాధర్, వెంకట్, రాజు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 4: రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వల సుజాతను ఆదివారం గోదావరిఖని వైశ్య సంఘం అధ్యక్షుడు నటరాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మార్కండేయ కాలనీలోని కోలేటి దామోదర్ నివాసంలో ఆమెను గోదావరిఖని వ్యాపారస్థులు, వైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోలేటి శ్రీనివాస్, నార్ల ప్రసాద్, వినోద్, నరేష్, విక్రం, మల్లికార్జున్, సతీష్, రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 4 : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండటంతో పాటు నియమాలను పాటించాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవపూర్ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్‌లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ స్వామి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి జీవితాలను కోల్పోవద్దని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల వెంట ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కమాన్‌పూర్, ఆగస్టు 4 : మండల కేంద్రంలో 15 నిరుపేద కుటుంబాలకు శ్రీసత్యసాయి సేవాదళ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అమృత కలశం పేరిట నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు సేవాదళ్ ప్రతినిధి నూక రమేష్, క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ లయన్, జబ్బర్‌ఖాన్ లయన్, అనవేణి లక్ష్మీరాజ్యం, సేవాదళ్ ప్రతినిధితులు బొజ్జ నరసింహచారి, బుగ్గాజి మహేందర్‌రెడ్డి, శంకరయ్య, బొంకూరు మోహన్, లక్ష్మణ్, యోగి, చందు తదితరులు ఉన్నారు.

నేత్రాలు దానం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 4: మండలంలోని మిర్జంపేట గ్రామానికి చెందిన రామిని తిరుపతమ్మ మృతిచెందగా మృతురాలి నేత్రాలు ఆమె కుమారులు దానం చేశారు. సదాశివ ఫౌండేషన్ ద్వారా తిరుపతమ్మ నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు అందజేశారు. మృతురాలి కుమారులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి భీష్మాచారి అభినందించారు.

రామగుండం సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించా..

- ఎన్టీపీసీ విస్తరణ, జీ థర్మల్ ప్రాజెక్టుకు హామీ - కేంద్రం నిధులు విడుదల చేయకనే ఈఎస్ఐ పనుల్లో జాప్యం : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 4: రామగుండం సమస్యలపై అసెంబ్లీలో తన గళాన్ని వినిపించానని, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీలో పని చేసే కాంట్రాక్టు కార్మికులకు జీఓ నెం.22 ప్రకారం వేతనాలు, ఎన్‌టీపీసీ విస్తరణ, జెన్‌కో విద్యుత్ కేంద్ర నిర్మాణంపై ప్రభుత్వం నుంచి హామీ పొందామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలను నెరవేర్చిందని, రూ.31వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేసిందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రయత్నం చేసిందన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో వివిధ అంశాలపై తాను మాట్లాడే అవకాశం లభించిందన్నారు. ఈ ప్రాంతంలో యువత ఉపాధిని దృష్టిలో ఉంచుకుని ఎన్‌టీపీసీలో 800మెగావాట్ల 3యూనిట్ల నిర్మాణానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ స్థానంలో సింగరేణి సహకారంతో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అలాగే ఎల్లంపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, లింగాపూర్ దళితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై కూడా ప్రభుత్వంతో మాట్లాడామన్నారు. రామగుండం నియోజకవర్గంలో గత పాలకుల వైఫల్యంతో అభివృద్ధి కుంటు పడిందన్నారు. ఏ ప్రభుత్వ శాఖలో కూడా నిధుల కోసం వారు సంప్రదించలేదన్నారు. గోదావరి కరకట్ట గురించి కనీసంగా ఆ శాఖలో మన ప్రజాప్రతినిధుల లేఖ లేకపోవడం సిగ్గుచేటన్నారు. తాను కరకట్ట నిర్మాణానికి లేఖ ఇవ్వడమే కాకుండా ప్రతిపాదనలు కూడా చేయిస్తున్నట్టు ఆయన తెలిపారు. రామగుండంలో పత్రికల్లో వార్తల కోసం కొందరు హడావిడి చేస్తున్నారే తప్ప వాస్తవాలు చెప్పడం లేదన్నారు. బండ్లవాగు ప్రాజెక్టుకు సంబంధించి పనులు పూర్తి చేయించలేదని, విద్యుత్ కనెక్షన్లకే రూ.6 కోట్ల వ్యయం అవుతుందన్నారు. వీటి మంజూరుకు సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. సర్వీస్ రోడ్ల దుస్థితికి గత పాలకులే కారణమన్నారు. నగరం ప్రారంభమైన ప్రాంతం నుంచి సర్వీస్ రోడ్డు ఉండాల్సి ఉండగా ఎన్‌టీపీసీ నుంచి మాత్రమే పెట్టారన్నారు. పైగా సర్వీస్ రోడ్డులోనే తరువాత పైప్‌లైన్లు, విద్యుత్ స్థంబాలు వేయించారన్నారు. ఇప్పుడు పైప్‌లైన్లు, విద్యుత్ స్థంబాలు తీయించాలంటేనే రూ.8కోట్ల వ్యయం అవుతుందన్నారు. మరో రూ.10 కోట్లు సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరం ఉంటుందన్నారు. ఇప్పటికే గాయత్రి సంస్థ దీవాళ ప్రక్రియపై చేతులెత్తేసిందన్నారు. గతంలో మెయింటనెన్స్‌కు కూడా చేయించలేని చేతగానితనం గత పాలకులదన్నారు. ఇప్పుడు సర్వీస్ రోడ్ల గురించి మాట్లాడే వారు కేసులు వేయించిన విషయం ప్రజలకు తెలుసునన్నారు. తాను మెయింటనెన్స్‌కు నిధులు మంజూరు చేయించానని, పనులు కూడా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే సర్వీస్ రోడ్ల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. బస్టాండ్ వద్ద షాపులు కోల్పోయే వారికి బస్ డిపో పక్కన గతంలో మున్సిపల్‌కు ఇచ్చిన స్థలంలో షాపుల ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే రామగుండం పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం గుర్తించడమే కాకుండా ప్రహరీ కూడా నిర్మించారన్నారు. టెండర్ల ప్రకియలో నిధుల సమస్యతో జాప్యం ఏర్పడుతుందన్నారు. పనుల్లో జాప్యంతో అంచనాలు పెరిగాయని, పెరిగిన అంచనాల నిధులను కేంద్ర విడుదల చేస్తే టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారన్నారు. ఇప్పటికే ఈ విషయంపై ఈఎస్ఐ ఆసుపత్రి ఉన్నతాధికారులను కలిసి విన్నవించామని, త్వరలోనే మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో పాటు కార్మికశాఖ మంత్రి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రిని కలిసి రామగుండం అభివృద్ధికి నిధులు అడుగుతామన్నారు. రామగుండాన్ని స్మార్ట్ సిటీగా చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కోరానని, త్వరలోనే ప్రధానిని కలిసి కూడా కోరుతామన్నారు. అలాగే రామగుండం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించామని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. రామగుండం అభివృద్ధిపై చర్చకు సిద్ధమని, తమ పార్టీ నాయకులు ఎక్కడైనా వచ్చి చర్చిస్తారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, పెద్దెల్లి ప్రకాష్, నాజీమోద్దీన్, దేవేందర్‌రెడ్డి, దూళికట్ట సతీష్, గడ్డం శ్రీనివాస్, పెంచాల తిరుపతి, శ్రీనివాసరెడ్డి, మేకల పోషం, పీక అరుణ్ పాల్గొన్నారు.

రామగుండంలో కంపుకొడుతున్న కాలనీలు

- అలసత్వం వీడని ఇంజనీరింగ్ విభాగం - టెండర్లు అయి ఏడాదైనా పనులు మొదలుపెట్టని కాంట్రాక్టర్లు - పట్టించుకునే వారు కరువు..



మార్కండేయ కాలనీలో నివాసాల మధ్య నిలిచిన మురుగునీరు



సంజయ్‌గాంధీనగర్‌లో..

కోల్‌సిటీ, ఆగస్టు 4: రామగుండం 'నగర' పాలన అంతా అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని ఏకైక నగర పాలక సంస్థ అయిన రామగుండంలో మున్సిపల్ సేవలు ప్రజలకు ఆశించిన మేర అందడం లేదు. పారిశుధ్యం పూర్తిగా లోపించింది. కాలనీలు కంపుకొడుతున్నాయి. పారిశుధ్య విభాగంలో 448మంది పనిచేస్తున్నా సేవలు వినియోగించుకోలేని దుస్థితి కార్పొరేషన్‌లో నెలకొన్నది. వర్షాకాల సీజన్‌లో పారిశుధ్యమే ప్రధానం కాగా రామగుండంలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణ లేక రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉంటోంది. ఇళ్ల మధ్యలో వర్షపు నీరు చెరువులను తలపిస్తున్నాయి. పాలనపై కమిషనర్ పూర్తిస్థాయి పట్టు సాధించకపోవడంతో విభాగాల్లో ఎవరికి వారుగా వ్యవహారాలు సాగిస్తున్నారు. తాను బదిలీ యత్నాల్లో ఉన్నానంటూ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లకు ఆయన సంకేతాలు ఇవ్వడంతో దాని ప్రభావం పాలనపై కనబడుతుంది. సాధారణంగా వర్షాకాల సీజన్‌లో పారిశుధ్య సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. నగర పాలక పరిధిలో 50 శాతం ప్రాంతాల్లోనే మున్సిపల్ సేవలందిస్తుండగా మిగతా ప్రాంతాల్లో సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, జెన్‌కో సేవలందిస్తున్నాయి. ప్రతి వర్షాకాలంలో ముందస్తుగా ప్రత్యేక టీములను ఏర్పాటు చేసేవారు. కార్పొరేషన్ సిబ్బందితోనే డ్రైన్ల పూడిక తీత, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పైగా వర్షాకాల సీజన్‌లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో చేర్పులు మార్పులు చేశారు. ఆ జాబితాను కూడా మూడు సార్లు తయారు చేసి మూడుసార్లు మార్చారు. కీలకమైన సమయంలో ఏరియాలపై అవగాహన ఉన్న వారిని మార్చడమేమిటంటూ కార్పొరేటర్లు అడ్డు చెబుతున్నారు. కనీస సిబ్బందిని సమకూర్చడం చేతకాక మార్పులు చేర్పులు ఏమిటంటే సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు.

ఇంజనీరింగ్ విభాగం... అదో ప్రహసనం...

రామగుండం నగరపాలక సంస్థలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కీలకమైన ఇంజనీరింగ్ విభాగం ప్రహసనంగా మారింది. ఎక్కడ ఏ పనులు జరుగాయి, ఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పర్యవేక్షించే పరిస్థితి లేదు. ఏళ్ల తరబడి టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించడం లేదు. మొదలు పెట్టిన పనులను సగంలోనే వదిలేస్తున్నారు. టెండర్ల దశల్లోనే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ డివిజన్ల పర్యటన సందర్భంగా అత్యవసరానికి బ్లేడ్ ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు సమకూర్చాలని ఆదేశించారు. దీనిపై టెండర్లు పెట్టిన ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్టర్ల ఒత్తిడితో టెండర్లు తెరవలేని దుస్థితి నెలకొన్నది. గతంలో అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన ఒక ఉన్నతాధికారి నుంచి పాత తేదిల్లో దొంగ ఫైళ్లు తయారు చేయించి సంతకాలు చేయించి బిల్లులకు ప్రతిపాదనలు చేయడం కొత్త వివాదాన్ని రేపుతోంది. గతంలో బిల్లులు చెల్లించిన కొన్ని ఫైళ్లకే మళ్లీ బిల్లులు రికార్డు చేయిస్తున్నారంటూ ఆరోపణలు కూడా వస్తున్నాయి. అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కడా పనులు ప్రారంభించాలి, ఏ దశల్లో ఉన్నాయి, ఎందుకు పనులు కావడం లేదని సమీక్షించే వారు లేరు. కనీసం ఇంజనీర్ల వర్క్‌డైరీ కూడా మెయింటనెన్స్ చేయలేని పరిస్థితి ఉంది.

కలెక్టర్ దృష్టి పెట్టినా..

రామగుండం నగరపాలనపై కలెక్టర్ శ్రీహర్ష ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రతి వారం వివిధ విభాగాలకు టార్గెట్లు పెడుతున్నారు. ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సరెండర్ చేశారు. అయినా పరిస్థితులు మారడం లేదు. శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో మార్పులు రావడం లేదని ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. రూ.3కోట్ల మేర ఆదాయానికి అవకాశం ఉన్న ట్రేడ్ లైసెన్స్‌ల విషయంలో పెద్దగా దృష్టి పెట్టడం లేదు.

గతంలో శానిటేషన్, రెవెన్యూ విభాగాలకు బాధ్యతలు ఇచ్చారు. ఇప్పుడు కేవలం ఒక్క ఉద్యోగిని మాత్రమే నియమించి వసూలు చేస్తున్నారు. రైస్ మిల్లులు, ఫంక్షన్ హాల్స్, ఆసుపత్రులు, సామిల్స్, వైన్స్ తదితర వ్యాపార సంస్థల నుంచి కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. స్పెషల్ డ్రైవ్‌గా టీములకు అప్పగిస్తే ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే అక్రమ కట్టడాలపై సైతం నియంత్రణలేని పరిస్థితి ఉంది.

రాణాకు చేరిన చిట్టీల పంచాయితీ

మల్లాపూర్, ఆగస్టు 4: మండలంలో జోరుగా జరుగుతు న్న జీరో చిట్టీల దందా చిలికిచిలికి గాలి వానగా మారి పోలీసుస్టేషన్‌కు చేరింది. మండలం లోని మొగిలిపేటలో జరుగుతున్న చిట్టీలతో మోసపోయామని నిర్వహకుడు ఆకుల గంగాధర్‌పై బాధితుడు సంగం పెద్దగంగారాం పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్ రూ. 5లక్షలు, రూ. 6లక్షలు, ఐదు తులాల బంగారం చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. దీంతో చిట్టీలు కట్టమని సంప్రదించగా రూ. 5, రూ. 6 లక్షల చిట్టీలు కట్టడంతో పాటు కుతూరు ముక్కెర లక్ష్మితో ఐదు తులాల బంగారం చిట్టీలను నాలుగు సంవత్సరాల నుంచి కట్టుకుంటు వస్తున్నామన్నాడు. కట్టిన చిట్టి డబ్బులు ఇవ్వమని ఆకుల గంగాధార్‌ను గతనెల నుంచి అడుగుతు న్నా పట్టించుకోకుండా దాటవేశాడు. దీంతో గ్రామంలోని పెద్దమనిషి వద్దకు పిలిచి అడగా మీరే డబ్బులు నాకు ఇంకా ఇవ్వాల్సి ఉందని బెదరింపులకు పాల్పడ్డాడు. కట్టిన చిట్టిన డబ్ములు ఇవ్వక బెదరింపులకు పాల్పడుతున్న ఆకుల గంగాదర్‌పై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్ద రాగట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మందాటి మల్లేశంపై ఆదివారం కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన మల్లేశంను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లేశం రహదారి వెంట వస్తున్న క్రమంలో గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా మీద పడి దాడికి దిగాయి. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు- ద్విచక్రవాహనం ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

మంథని ఆగస్టు 4: ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటన ఆదివారం మంథని మున్సిపాల్ పరిధీలోని గంగపురి వద్ద చోటు చేసుకుంది. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్08జెడ్0086) మంథని నుంచి హైదరాబాదుకు వెళ్లే క్రమంలో గంగపురి మూలమలుపు వద్ద ప్రమాదం సంభవించింది. ముత్తారం నుంచి మంథనికి వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఆర్టీసీ బస్సుకు తగలడంతో ద్విచక్ర వాహనం కింద పడింది. ద్విచక్రవాహ నం వెనుకాల కూర్చున్న వ్యక్తి దండు పోచయ్యకు ప్రమాదంలో కాలు విరిగింది. గాయపడిన వ్యక్తిని మంథని ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

తాగడానికి డబ్బులు లేక మద్యం షాపుల్లో చోరీలు

- నిందితుడిని పట్టుకున్న సుల్తానాబాద్ పోలీసులు

సుల్తానాబాద్, ఆగస్టు 4: మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి మద్యం కొనుగోలుకు డబ్బులు లేక తురుచుగా మద్యం దుకాణాల్లోనే దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తాము సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సిద్దిపేట మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన మడిగుడ్ల విజయ్‌కుమార్ (40)అనే వ్యక్తి ˇ పట్టుబడ్డారని తెలిపారు. ఇతన్ని విచారించగా దొంగతనాలను వృత్తిగా చేసుకు ని విందులు వినోదాలు జల్సాలు చేసుకుంటున్న వ్యక్తిగా నిర్ధారణ చేశామన్నారు. నాలుగు రోజుల క్రితం సుల్తానాబాద్ పట్టణంలోని పల్లవి బార్‌లో కూడా దొంగతనం చేశాడని, బార్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. విజయ్ కుమార్ మొదటి సారిగా సుల్తానాబాద్ ప్రాంతానికి వచ్చి రాజీవ్ రహదారి సమీపంలోని ఈ బార్‌ను ఎంచుకుని అతిగా మద్యం సేవించి బార్ గోడ దూకి దొంగతనానికి పాల్పడ్డాడని వివరించారు.

● **వివిధ జిల్లాల్లో ముప్పై కేసులు..**

మద్యానికి బానిసగా మారిన విజయ్‌కుమార్ మద్యం కోసం, జల్సాల కోసం చోరీలకు పాల్పడే వాడని ఇలా రంగారెడ్డి, సిద్దిపేట, జీడిమెట్ల, కొత్తగూడెం, రాయదుర్గం, వనస్థలిపురం, మహబూబాబాద్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాలో ముప్పై కేసులు నమోదై ఉన్నాయని ఎస్ఐ శ్రావణ్ కుమార్ వివరించారు. నిందితుడిని అదివారం సుల్తానాబాద్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు తెలిపారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 4: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరు జలశయానికి ఎత్తిపోతలు కొనసాగుతున్నా యి. ఆదివారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరు డ్యాంలోకి తరలి వె ళుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 15.507 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- **ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 18,291 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 44.266 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాజన్న ఆలయంలో నేటినుంచి బ్రేక్ దర్శనం

వేములవాడ రూరల్, అగస్టు 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి బ్రేక్ దర్శనం అమలు చేయనున్నట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10-15 ని॥ల నుంచి 11-15 ని॥ల వరకు, సాయంత్రం 4-00 నుంచి 5-00 వరకు భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం ఉంటుందన్నారు. బ్రేక్ దర్శనం టికెట్ 300 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు కుంటల విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని విత్తనాలకు సంబంధించిన చేప పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. అయితే చేపపిల్లల పంపిణీకి గత నెలలో టెండర్‌లు పిలవగా, సంబంధిత చేపపిల్లల కాంట్రాక్టర్‌లు కుమ్మక్కయ్యారని ఎవరూ టెండర్‌లో పాల్గొనకుండా చేయడం వల్ల కార్యక్రమం వాయిదా పడిందన్నారు. కావున చేపపిల్లల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాక తరుపున ప్రత్యక్షంగా చేపపిల్లల పంపిణీకి బదులు వాటి విలువకు అనుగుణంగా చెరువు విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని మత్స్యపారిశ్రామిక సంఘాలకు నేరుగా నగదు రూపకంగా గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ చర్యల వల్ల దళారీవ్యవస్థ జోక్యం నిలువరింపజేయవచ్చన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాసిన లేఖపై జిల్లా గంగపుత్ర సంఘ పక్షాన గుమ్ముల అంజయ్య జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





అధ్వానంగా రహదారులు

- వర్షాలకు మరింత ప్రమాదకరంగా రోడ్లు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



అధ్వానంగా రాంపూర్- రామన్నపేట మార్గం



ముత్యంపేట వరదకాలువ బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు



గుంతలతో ముత్యంపేట నుంచి బ్లాక్ చౌరస్తాకు వెళ్లే మార్గం

మల్యాల, ఆగస్టు 4: మండల వ్యాప్తంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మతులు లేకపోవడం, కొత్తగా పనులు చేపట్టకపోవడంతో ప్రయాణానికి ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఈ రహదారులపై తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. లోతైన గుంతలు, దారి అంతా కాలువలను తలపించేలా నీటి నిలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో రహదారులు కోతలకు గురి కాగ కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. తారు లేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. రామన్నపేట- రాంపూర్- జగిత్యాల వెళ్లె రహదారికిరువైపుల కోతలకు గురి అయి లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం గుంతలమయమై బురద రోడ్డుగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే గొర్రెగుండం వెళ్లె మార్గంలో తారు లేచి, గోతులు ఏర్పడ్డాయి. ఇదే మార్గం నుంచి మండంలోని ఓగులాపూర్‌తో పాటు కొడిమ్యాల మండలానికి నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. రహదారి అధ్వన్నంగా మారడంతే ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తుంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారులు దెబ్బతినడంతో ప్రజలు, ప్రయాణీకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

- **కాలువలను తలపిస్తున్న రహదారులు**

మండలంలోని వరదకాలువ ప్రాంత గ్రామాల పరిధిలో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. వరదకాలువతో ఒర్రెలు ఉనికి కోల్పోగా వాటి ద్వారా వచ్చే నీరు రహదారులపై ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వరదకాలువ వంతెనలపై మరమ్మత్తులు లేకపోవడంతో బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉంది. తగు చర్యలను తీసుకోవాలని వరదకాలువ ప్రాంత ప్రజలు, ప్రయాణీకులు అధికారులను కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





వేములవాడ, సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

వేములవాడ రూరల్, ఆగస్టు 4: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం పోరాటం చేస్తామని, గ్రామస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో టీకేఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నికల వేళ డబ్బు ప్రభావం పెరిగినా ప్రజలు ఇప్పటికీ ఎర్ర జెండా వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రజల సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు ముందుంటాయన్నారు. ప్రజల పక్షాన పోరాడడానికి పార్టీ చట్ట సభల్లో బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. మతంపేరుతో పబ్బం గడుపుకునే పార్టీలకు త్వరలోనే కాలం చెల్లుతుందన్నారు. పార్లమెంట్‌లో సీట్లు తగ్గినప్పటికీ బీజేపీ నాయకులకు అహం తగ్గడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకువస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఎండగడుతామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు టి వెంకటరాములు, టీకెఎంయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. కాంతయ్య, ఎన్ బాలమల్లేశ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కయ్యడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, ఏసు, నాయకులు లింగారెడ్డి, మహాలక్ష్మి, కడారి రాములు పాల్గొన్నారు.

- **వస్త్ర పరిశ్రమలను కాపాడాలి..**

సిరిసిల్ల రూరల్: రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్మలు, అక్కలంటూ తిట్టుకునే దుస్థితి వచ్చిందని, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ఒకరిని ఒకరు తిట్టుకోవడంపై అధికార, ప్రతిపక్షాలు దృష్టి పెట్టాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఉపాధి కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొనసాగించిన పథకాలను బంద్ చేసి కార్మికులకు ఉపాధిని దెబ్బతీయం ఎంతవరకు సమంజమన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తాను మాట్లాడానని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందన లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్డర్లకు సంబంధించిన బకాయిలను ఇవ్వలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆసాములసమన్వయ కమిటి అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, పోరండ్ల రమేష్, ఏనుగుల ఎల్లయ్య, అంకాలపు రవి, గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్, గోవిందు రాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఆగస్టు 4: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో విలేజ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం టీఎస్02యూడీ4400 ఆటో ట్రాలీలో 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అట్టీ బియ్యం ఎక్కడి నుంచి తీసుకొని వెళ్తున్నారని, రవాణా చేయుటకు అనుమతి పత్రాలు ఉన్నాయానని ప్రశ్నించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో విచారించగా, తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందించే బియ్యాన్ని ఒక కిలోకి రూ. 12ల చొప్పున కొనుగోలు చేసి చింతకుంట, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లోని కోళ్ల పారాలకు రూ. 17లకు అమ్ముకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారన్నారు. ట్రాలీని, గంట వెంకటేష్, సిద్ధంకి భాస్కర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 4: శంకరపట్నం మండలం చింతలపల్లి శివారులో ఆటో బైక్ ఢీ కొని ఒకరు గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం కొండపలకల గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి గణపతిరెడ్డి చింతలపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా, చింతలపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో గణపతిరెడ్డి తలకు, కాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 4: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని శాలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాల మహానాడు సభను విజయవంతం చేయండి

కొడిమ్యాల, ఆగస్టు 4: డిల్లీలోని జంతర్‌మంత ర్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించే మాల మహానాడు సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మేడి అంజయ్య మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారానికి నిర్వహించే సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు హలో మాల చలో డిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చెన్నల సుమన్, మండల అధ్యక్షుడు కాయితరాజు, కన్వీనర్ రావుల నర్సింగరావు, నాయకులు బండి చందు, రాకేష్, శేఖర్, అర్జున్, యుగందర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల సంఘం నాయకులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



లంబ రాములు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని వ్యక్తి లంబ రాములు అదృశ్యంపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు ఆదివారం తెలిపారు. రాములు గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాడిగేదెకు గడ్డి వేసి వస్తానని ఈ నెల 3న ఇంటిలో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడని పేర్కొన్నారు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదని చెప్పారు. రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు వివరించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 4: బోయినపల్లి మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన కడుదుల కొమురయ్య(70) అనే వృద్ధుడు అనారోగ్యంతో ఇబ్బంది పడి ఇంటిముందు ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కేతమ్మ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కొడుకులు గతంలోనే చనిపోయారు. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకున్నట్లు కొమురయ్య భార్య కేతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



కటకం సత్యం(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4: నగరంలోని పద్మనగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై కటకం సత్యం (48) అనే వర్కర్ మృతి చెందాడని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం శాలపల్లికి చెందిన కటకం సత్యం రోజులాగే ఆదివారం 12:30 గంటల ప్రాంతంలో స్కూల్ మైదానంలోని రన్నింగ్ ట్రాక్‌ను జెట్ ప్రెషర్ పంప్‌తో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న సూపర్‌వైజర్, కుక్‌లు గమనించి మోటార్ ప్లగ్ తొలగించారు. కిందపడిపోయిన సత్యంను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన



ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్16 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నెట్స్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 142 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి నిర్వహకులు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాలలో ప్రతిభను పరీక్షించి, ప్రతిభ చాటిన 18మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రికెట్ జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినున్న అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ పోటీల నిర్వహణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు పాల్గొని పర్యవేక్షించారు. జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు, ఈసీ అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు

- టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: పదేళ్లుగా ప్రమోషన్‌లు, బదిలీల కల సాకారం చేసి వందలాది కోర్టు కేసుల ద్వారా నమ్మకం కోల్పోయిన వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతుల కల సాకారం చేసిన ప్రభుత్వం, తమ సర్వీస్ రూల్స్‌ను సైతం తప్పక అమలు చేస్తుందనే విశ్వాసం తమకుందని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో టీఆర్టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తూ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. జీవో నంబర్ 11, 12ను సవరించి బీఈడీ పూర్తి చేసిన ఉపాధ్యా యులకు పీఎస్ హెచ్‌ఎంల పదోన్నతికి అర్హత కల్పించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. త్వరలోనే పీఎస్ హెచ్‌ఎంల పోస్టులు మంజూరు చేస్తూ వాటిలో ఎస్జీటీ ఉపాధ్యాయుల అందరికీ పదోన్నతి అవకాశం కల్పించబడుతుందని వివరించారు. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. జీవో నంబర్ 317 ఉత్తర్వుల మేరకు నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ స్థానిక జిల్లాలో బదిలీల కొరకు రాష్ట్ర సంఘ పక్షాన కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్, విజయానందరావు. చిన్నయ్య, సాయికృష్ణ, రణధీర్, అంబాజీ నాయక్, భీమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కటుకం రమేష్

రైల్వే అండర్ బ్రిడ్జిల సమస్యకు పరిష్కారమెప్పుడు?

- చిన్నపాటి వర్షానికే నిలుస్తున్న నీరు - రాకపోకలకు తీవ్ర ఆటంకం - ఇబ్బందులు పడుతున్న రైతులు, వాహనదారులు



ఇటీవల కురిసిన వర్షాలకు ఓదెలలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీరు

ఓదెల, ఆగస్టు 4: గ్రామాల్లోని ప్రజల రాకపోకల కోసం నిర్మించిన ఓదెల, ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిలు వివిధ గ్రామాల ప్రజలకు, ముఖ్యంగా రైతులకు పెద్ద శాపంగా మారాయి. ఈ రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలు ఎవరికి ఉపయోగం లేకుండా పోతున్నాయి. పదేళ్ల క్రితం సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు రైల్వేస్టేషన్‌ల సమీపంలో లాక్ లేని ఓపెన్ గేట్లు ఉండడంతో రైళ్లకు ఢీకొని తరచుగా బస్సు ప్రమాదాలు గతంలో ఎక్కువ సంభవించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర రైల్వే బోర్డు దృష్టిని సారించి రక్షణ లేని గేట్లను తొలగించేందుకు నిర్ణయం తీసుకొని, వీటి స్థానంలో అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని ఉద్దేశంతో కోట్లాది కేంద్ర రైల్వే నిధులతో భారీఎత్తున అండర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఓదెల 30వ, రైల్వే గేటును తొలగించి దీని కింద నుంచి ఓడెల, కొమిర, పొత్కపల్లి గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా 10 ఏళ్ల క్రితం రూ. 1.25 కోట్ల నిధుల వ్యయంతో అండర్ రైల్వే బ్రిడ్జి(యూఆర్‌బీ) నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు కూడా వర్షాకాలం వస్తే చాలు వరద నీటితో నిండి ఈ బ్రిడ్జి నుంచి ఎవరు వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో బ్రిడ్జి కింది నుంచి ప్రజలు ఏ గ్రామానికి చేరుకోలేరు. ఈ విషయమై పలువురి రైల్వే జీఎంలకు ఈ అండర్ బ్రిడ్జి నిర్మాణంపై గ్రామానికి చెందిన పలువురు యువకులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పుడల్ల పరిశీలిస్తామని, అధికారులను పంపిస్తామని మాటలకే పరిమితమయ్యారు.

ఏ అధికారి కూడా ప్రజలకు సౌకర్యంగా, శాశ్వత పరిష్కారం చూపించడం లేదని, వెంటనే అధికారులు స్పందించి మండల ప్రజలు ఈ అండర్ బ్రిడ్జిల నుంచి వెళ్లే విధంగా శాశ్వతమైన పరిష్కారాన్ని చూపాలని కోరుతున్నారు.

● ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నరకం

చుట్టూరా పచ్చటి పంటలతో కళకళలాడే ఉప్పరపల్లి శివారులో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి రైతులకు, గ్రామస్తులకు నరకాన్ని చూపిస్తుంది. రెండేళ్ల క్రితం రూ.7.34కోట్ల రైల్వే నిధుల వ్యయంతో 35వ, గేటును తొలగించి కిందినుంచి అండర్ బ్రిడ్జిని నిర్మించారు. అలాగే దీనిని 8 నెలల క్రితం ఆర్భాటంగా ప్రధాని మోదీ ఆన్‌లైన్ పద్ధతి ద్వారా రైల్వే అండర్ బ్రిడ్జిలను ప్రారంభించారు. ప్రస్తుతం వరదనీటి ప్రవాహం చేరుకోవడంతో గ్రామస్తులకు అలాగే రైతులకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అలాగే ఉప్పరపల్లికి చెందిన రైతుల వ్యవసాయ భూములు అధికంగా ఈ అండర్ బ్రిడ్జి దాటితేనే ఉన్నాయి. ఈ గేట్ వరకు వచ్చి రైతులు ఇక భూములను సాగు చేయాలంటే మహిళ కూలీలతో పాటు రైతులు బ్రిడ్జి పై నుంచి పెద్ద సాహసం చేస్తేనే వారి భూములను సాగు చేసుకోవాల్సి వస్తోంది. బ్రిడ్జిపై నుంచి నడిచి పోయే ముందు కాలి అడుగు తప్పిందంటే చాలు నేరుగా బ్రిడ్జినీటిలో పడిపోయే ప్రమాదం నెలకొంది. ఈ సాహసం చేయకుంటే బ్రతుకు నిచ్చే వ్యవసాయ భూములు బీళ్ళుగా మిగిలే పరిస్థితిఉంది. ఈ బ్రిడ్జి కింద నిలువ ఉన్న నీరు ఎటువైపు వెళ్లిపోయే పరిస్థితి లేదు. దీనివల్ల రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొలనూర్‌కు ఉప్పరపల్లి గ్రామస్తులు సుల్తానాబాద్ మండలం మద్దికుంట మీదుగా ఆరు, ఏడు కిలోమీటర్లు దూరభారాన్ని అనుభవిస్తూ తిరిగిపోతున్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ కూడా ఎలాంటి ఫలితాలు లేకుండా పోయాయి. అధికారులు వెంటనే స్పందించి ఓదెల, ఉప్పరపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిల నుంచి గ్రామస్తులు, రైతులు వెళ్లేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● నాటి రోడ్డే బాగుండేది..

- మార్క రవికుమార్, ఓదెల గ్రామస్తుడు



ఓదెల, కొమిర, పొత్కపల్లికి వెళ్లాలంటే గతంలో ఉన్న గేటు నుంచి రోడ్డు సౌకర్యవంతంగా ఉండేది. బ్రిడ్జి నిర్మించి అందరిని ఇబ్బందులు పాలు చేస్తున్నారు. దీని కింద ఉన్న నీటిని తోడేస్తేనే భూముల సాగు, గ్రామాలకు రాకపోకలు సాగుతాయి. లేదంటే ఇబ్బందులు తప్పడం లేదు.

● రైల్వే అధికారులు స్పందించాలి

- రాకేష్, ఉప్పరపల్లి గ్రామస్తుడు



రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైతులు గ్రామాల ప్రజలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి. అంతకు ముందున్న రైల్వే గేటు నుంచి ఉన్న రోడ్డు అందరికీ ఉపయోగపడేది. అండర్‌బ్రిడ్జి నిర్మాణంతో ఉప్పరపల్లితో పాటు వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

- పట్టించుకోని అధికారులు



జీఎం కాలనీలో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 4: గత రెండు సంవత్సరాలుగా గోదావరిఖని జీఎం కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదంగా మారి విద్యుత్ షాక్ వస్తున్నా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. సాంబయ్య, రామకృష్ణ, విజయ్‌కుమార్‌లు తమ ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలతో వర్షం వస్తే ఇల్లు మొత్తం షాక్ వస్తుందని, దీనిపై పలుమార్లు విద్యుత్‌శాఖకు, రామగుండం కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, గోడలు తడవడం వల్ల విద్యుత్ తీగలు ఇంటిపై ఉన్న గోడలకు తాకుతూ వర్షాకాలం ఇల్లు ఆవరణ మొత్తం షాక్ వస్తుందని, దినదినం గండంగా బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వచ్చి చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరారు.

అన్నప్రసాద వితరణ

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 4: వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గోదావరిఖని కొత్త కూరగాయాల మార్కెట్ వద్ద ఆదివారం అమావాస్య అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వెనిశెట్టి నటరాజ్ శేఖర్ హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో గడ్డం రవీందర్, బెనిశెట్టి వీరన్న, సత్యనారాయణ, వెంకటముత్యం, కల్వల నరసయ్య, కోటగిరి శ్రీకాంత్, అశోక్, శ్రీరాములు, మధుకర్, దయానంద్, అంజన్న, సత్యం, వీరన్న, రాజు పాల్గొన్నారు.

ప్రధాన దారిపై ప్రవహిస్తున్న మురికి నీరు

జూలపల్లి, ఆగస్టు 4 : మండలంలోని పెద్దాపూర్‌లో గల ఎస్సీకాలనీలో ఇటీవల డ్రైనేజీ నిర్మించిన కాంట్రాక్టర్ మురుగునీటిని ప్రధాన రోడ్డుపై వదిలివేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని కాలనీ ప్రజలు మండిపడుతున్నారు. ఆ దారి గుండా వెళ్లడం కూడా ఇబ్బందిగా మారిందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మురు గునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్టీల వర్గీకరణ వెంటనే చేయాలి



మాట్లాడుతున్న లోకిని రాజు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీల వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్టీలలో 14తెగలు ఉన్నాయని, అందులో కొన్ని ఉప కులాలు ఆర్థికంగా, సామాజిక వెనుకబడి ఉన్నాయని చెప్పారు. వెనుకబడిన వారికి ప్రభుత్వం నుంచి సరైన సంక్షేమ పథకాలు అందడం లేదని, ఉప కులాల్లో ఇండ్లు, భూములు, ఉపాధి లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయన్నారు. వెనుకబడిన ఉప కులాలకు న్యాయంజరిగేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏబీసీడీ వర్గీకణ చేయాలని కోరారు. పెద్దపల్లి జిల్లా కన్వీనర్ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాకేష్, కుమార్, శ్రీనివాస్, బాపు, సారయ్య, ఎల్లయ్య, రవి, పోషం, సమ్మయ్య, సంపత్, అంజి, తిరుపతి పాల్గొన్నారు.

రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలి



చిన్నారులకు ఆయుర్వేద గుళికలు వేస్తున్న మాజీ ఎంపీపీ

సుల్తానాబాద్, ఆగస్టు 4: చిన్నపిల్లలకు జ్ఞాపక శక్తిని, శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఆయుర్వేద ఔషధాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు అన్నారు. చిన్నజీయర్ స్వామి వారి ఆయుర్వేద యూనివర్సిటీలో తయారు చేసిన ఈ ఔషధాన్ని లాభాపేక్ష లేకుండా దేశమంతటా పంపిణీ చేస్తున్నారని అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయంలో ఔషద పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ ఆదివారం ప్రారంభించారు. వికాస తరంగిణి ప్రతినిధులు సుగుణాకర్, పొదిళ్ల రమేష్, స్వరూప, వనజ తదితరులు మాట్లాడుతూ జీరో వయసు నుంచి పదహారు సంవత్సరాల పిల్లలకు ఈ మందు వేయించాలన్నారు. ప్రతీ నెల పుష్యమీ నక్షత్రం రోజున అంతటా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టం రమేష్, అల్లాడి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



వైద్యుడు మహేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 4: గత వారం క్రితం కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులు మహేందర్‌ను కొంతమంది వ్యక్తులు దాడిచేసి గాయపర్చగా ఆదివారం అతని స్వగృహం నిట్టూరు గ్రామానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఎట్టకేలకు మత్స్య సొసైటీకి ప్రభుత్వ గుర్తింపు



ప్రభుత్వ గుర్తింపు పత్రం అందుకుంటున్న గొల్లపల్లి ముదిరాజ్ కులస్తులు

సుల్తానాబాద్, ఆగస్టు 4: సుల్తానాబాద్ మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్‌లకు పెద్దపల్లి మత్స్య శాఖ వారు శనివారం సొసైటీ ఏర్పాటు చేస్తూ గుర్తింపు పత్రాన్ని జిల్లా మత్స్య శాఖ అధకారి భాస్కర్, ఫీల్డ్ అఫీసర్ హరీష్‌లు గొల్లపల్లి ముదిరాజ్ కుల సంఘ నాయకులకు అందజేశారు. దాంతో ఇక నుంచి ఆ గ్రామానికి చెందిన ముదిరాజ్‌లకు ప్రభుత్వ పరమైన లబ్ధి చేకూరనుంది. కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామ సొసైటీ లేకపోవడం, ప్రభుత్వ అనుమతి ఇవ్వక పోవడంతో తాము ఎలాంటి లబ్ధి పొందలేదని మాజీ ఎంపీటీసీ గట్టు శ్రీనివాస్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరక్టర్ వీరస్వామి తదితరుల కృషి ఫలితంగా మా గ్రామానికి అధికారులు గుర్తింపు పత్రాన్ని అందజేశారని వారు తెలిపారు.

రైతు బీమాకు దరఖాస్తుల స్వీకరణ

ఓదెల, ఆగస్టు 4: మండలంలో నూతనంగా భూముల పాస్ పుస్తకాలు పొందిన రైతులు సోమవారం వరకు రైతుబీమాకు దరఖాస్తులు అందజేయాలని ఏవో రాంబాబు కోరారు. రైతులకు సమాచారం తెలిపినప్పటికీ ఇప్పటివరకు దరఖాస్తులు అందలేదని, గడువు తేదీ ప్రకటించినప్పటికీ రైతు వేదికల్లో దరఖాస్తులు అంద లేదని తెలిపారు. 5వ తేదీ తర్వాత దరఖాస్తులు అందజేస్తే ఎవరికి ఫలితం ఉండదని తెలిపారు. వెంటనే రైతులు స్పందించి స్థానిక రైతు వేదికల్లో సంబంధిత ఏఈవోలకు తమ దరఖాస్తులను అందజేయాలని అలాగే 7569947502 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి అదనపు సమాచార వివరాలు తెలుసుకొని, వ్యవసాయ శాఖ అందజేసిన సమాచారం మేరకు రైతులు పాటించాలని ఏవో కోరారు. ప్రమాదాలు జరిగినట్లయితే ఏ రైతుకు కూడా బీమా వర్తించదని, భూములున్న పాస్ పుస్తకాలతో దరఖాస్తులు అందజేసిన వారికి మాత్రమే రైతు బీమా వర్తిస్తుందని తెలిపారు.

హమాలీ సంఘం కార్యవర్గం

మంథని, ఆగస్టు 4: మంథని హమాలీ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికయ్యారు. ఆదివారం మంథని పట్టణం హమాలీ సంఘం కార్యాలయంలో ఎన్నికల నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కాశెట్టి సురేష్ వ్యవహరించారు. అధ్యక్షునిగా అయిలి సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా ఐలి సతీష్, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల రామకృష్ణ, , కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యల కోసం కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం కమిటికి కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శ్రావణం..శుభప్రదం

- మంగళ గౌరీ, వరలక్ష్మి వ్రతాలు
- వెల్లివెరియనున్న భక్తిపారవశ్యం
- నేటి నుంచి శ్రావణ సందడి
- సామూహిక కంకుమార్చనలు



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రావణ మాసం ఎంతో శుభ ప్రదమైంది. శుభకార్యాలు, నోములు, వ్రతాలతో భక్తి భావంతో పరవశించిపోతారు. పెళ్లి పనులతో కొందరు.. దేవాలయాలను సందర్శిస్తూ మరికొందరు హడావుడిగా కనిపిస్తారు. కుటుంబ సుఖ సౌక్యాల కోసం మహిళలు నోములు, వ్రతాలు చేస్తారు. శ్రావణ మాసంలో మంగళ గౌరీ, వరలక్ష్మి వ్రతాలతోపాటు నాగపంచమి, రాఖీ పౌర్ణమి పండుగ జరుపుకుంటారు. ముఖ్యంగా పెళ్లి అయిన మొదటి ఐదు సంవత్సరాల్లో మహిళలు మంగళ గౌరీ వ్రతం చేస్తారు. ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2 అమవాస్యతో ముగుస్తుంది. శ్రావణ మాసంలో మహిళలంతా హుషారుగా కనిపిస్తారు. లక్ష్మి కటాక్షం ఉంటే అన్నింటా అభివృద్ధి, అంతులేని సంపద కలుగుతాయని విశ్వసిస్తారు. మహాలక్ష్మి ప్రాణనాథుడు శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రమైన శ్రావణం పేరుతో శ్రావణ మాసం కొనసాగుతుంది. విష్ణువును శ్రద్ధా భక్తులతో పూజిస్తారు. మహాలక్ష్మి అనుగ్రహం కోసం పూజలు చేస్తారు. శ్రావణంలో అన్ని శుభదినాలే. ముఖ్యంగా సోమ, మంగళ, శుక్ర, శనివారాలు ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు. మంగళ గౌరీ వ్రతం, నాగపంచమి, భాను సప్తమి, పుత్రదా ఏకాదశి, దామోదర ద్వాదశి, వరహా జయంతి, వరలక్ష్మి వ్రతం, జంధ్యాల పౌర్ణమి, పొలాల అమవాస్య పండుగలు జరుపుకుంటారు.

శివుడికి ప్రీతికరం

శ్రావణమాసంలో ప్రతీ సోమవారం శివుడికి ప్రీతికరమైనదిగా భావిస్తారు. శివ భక్తులు నాలుగు సోమవారాలు దీక్షగా ఉపవాసం ఉండి అభిషేకం, శమకం, పార్వతిదేవికి కుంకుమ పూజలు చేస్తారు. కుమారస్వామిని, నందీశ్వరున్ని పూజిస్తారు. పూజారులు రుద్రం వల్లిస్తారు. శివుడి వద్ద దీపాలన్ని వెలిగించి కుంకుమ, బియ్యం, చందనం, పూలు, యాలకులు, లవంగాలు, వక్కలు, దుర్వార పత్రం, దత్తుర దళాలను సమర్పించుకుంటారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

కృష్ణాష్టమి వ్రతం

శ్రావణ బహుళ అష్టమి శ్రీకృష్ణ జయంతిని జరుపుకుంటారు. ఈ నెల 26న స్మార్థకృష్ణాష్టమి, 27న వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోనున్నారు. కృష్ణాష్టమి నాడు ఇళ్లను శుభ్ర పరిచి తోరణాలతో అలంకరించి ఇంటి ముంగిళ్లలో బాలకృష్ణనుడి పాద ముద్రలు వేస్తారు. ఉట్టి కొట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు.

మూడు సొసైటీల ముచ్చట తీరేనా..?

● భూషణరావుపేట సింగిల్ విండో విభజనపై ఆశలు

● విండో ఏకగ్రీవ తీర్మానం..

సర్కారు ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు



భూషణరావుపేట సింగిల్ విండో కార్యాలయం

కథలాపూర్, ఆగస్టు 4 : రైతులకు సత్వర సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 12 గ్రామాలతో విస్తరించి ఉన్న మండలంలోని భూషణరావుపేట సింగిల్ విండోను విభజించాలని నిర్ణయించారు. ఈ మేరకు పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ సహకార శాఖ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రభుత్వం నుంచి విభజనకు సంబంధించిన ఉత్తర్వుల కోసం రైతాంగం నిరీక్షిస్తోంది. ఈ ప్రక్రియకు మోక్షం లభిస్తే రైతులకు సేవలు సకాలంలో అందడానికి వీలు కలుగుతుంది.

● రు. 15.30 కోట్లతో లావాదేవీలు

భూషణరావుపేట సొసైటీ పరిధిలో ప్రస్తుతం 12 గ్రామాలు ఉండగా చివరి గ్రామం కలికోటకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో అక్కడి రైతులు సొసైటీకి వివిధ పనుల నిమిత్తం రావాలంటే దూరభారంతో ఇబ్బందులు పడుతున్నారు. పంట, వాహనాలు, పైపులైన్లపై రుణాలు పొందడానికి తరచూ కిలోమీటర్ల కొద్దీ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భూషణరావుపేట సొసైటీని కథలాపూర్, అంబారిపేట, భూషణరావుపేట సొసైటీలు విభజిస్తే గ్రామాలకు సరైన సేవలు అందడానికి ఆస్కారం ఉంటుందని కొన్నేళ్లుగా రైతాంగం అభిప్రాయపడుతోంది. కథలాపూర్ కింద దూలూరు, దుంపెట, పోసానిపేట, అంబారిపేట పరిధిలోకి ఇప్పపల్లి, పోతారం, కలికోట, భూషణరావుపేట కింద చింతకుంట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాలను విభజించాలని ప్రతిపాదన చేశారు. పాలక వర్గం ఏకగ్రీవ తీర్మానం చేసి జిల్లా సహకార అధికారికి ఈ మధ్యకాలంలో పంపించారు. ప్రస్తుతం ఈ సొసైటీ రు. 15.30 కోట్ల టర్నోవర్‌తో లావాదేవీలు కొనసాగిస్తోంది. ఇప్పటికే 9 ఎరువుల గోదాములు నిర్మించి రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. సొసైటీ లో 1912 మంది సభ్యులు ఉండగా 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. 12 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1.45 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఎప్పటి నుంచో మూడు సొసైటీల విభజన చేయాలని రైతాంగం కోరుతున్నా ఆ ప్రక్రియకు మోక్షం లభించం లేదు.

వారం రోజుల కిందట ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి ఈ అంశం తీసుకెళ్లడంతో మూడు సొసైటీల ఏర్పాటు ముచ్చట తీరుతుందనే ఆశలు పెరిగాయని రైతాంగం పేర్కొంటున్నారు.

● తీర్మానం జిల్లా అధికారులకు పంపించాం

లోక బాపురెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్



ప్రస్తుతం దూరంలో ఉన్న గ్రామాల రైతులు భూషణరావుపేటకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు సొసైటీలను చేస్తే రైతులకు సత్వర సేవలు అందుతాయి. పునర్‌విభజన చేస్తేనే రైతులను న్యాయం జరుగుతుంది. పాలక వర్గం ఏకగ్రీవ తీర్మానం చేసి జిల్లా సహకార అధికారికి పంపించడంతో పాటు ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం. తొందరగా విభజన జరుగుతుందని ఆశిస్తున్నాం.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





పెగడపల్లి, బండలింగాపూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పెగడపల్లి, ఆగస్టు 4 : మండల కేంద్రంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. మండల కేంద్రానికి చెందిన రామకృష్ణా విద్యాలయంలో 2007-08లో పదవతరగతి విద్యనభ్యసించిన విద్యార్థులంతా ఆదివారం మండల కేంద్రంలో సమావేశమై తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు. ఒకరికొకరు తమ ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ పరిస్థితులు తదితర విషయాల గూర్చి ఆత్మీయంగా చర్చించుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు జూపల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు వేణు గోపాల్‌రావు, ప్రశాంత్‌రావు, పూర్వ విద్యార్థులు మహేందర్, మహేష్, రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదోవ తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులంతా సమ్మేళనంగా కలుసుకున్నారు. ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని కేఆర్ ఎస్ గార్డెన్‌లో పాఠశాలలోని 2002-03 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు నాటి గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆనందంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తోటి మిత్రులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసు కున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను శాలువాలు, మెమోంటోలతో సన్మానించారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

జూలపల్లి, ఆగస్టు 4 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నిక ల్లో బీజేపీ సత్తాచాటేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఒక ప్రైవేటు పంక్షన్‌హాల్‌లో ఆదివారం మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిం చారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు జరగడంలేదని విమర్శించారు. మండలంలో బీజేపి పార్టీని పూర్తిస్తాయిలో బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈకార్యక్రమంలో బీజేపి నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, ఈర్ల శంకర్, సంపత్, చిలుక తిరుపతి, సంతోష్‌రెడ్డి, భూసారపు రవిందర్‌గౌడ్, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గోన్నారు.